


చంద్రశేఖరం చాలా మంచివాడు. ఆఫీసులో అతనికి మించిన గుణవంతుడు కాని, కార్యశీలి గాని మరొకరు లేరు. ఎవరినీ పల్లెత్తు మాట అనడు. పని చేయనివారిని సంజాయిషీ ఇమ్మని కోరటం గాని, సెలవు లేకుండా గైరు హాజరైనవారిని అదేమని కాని ఎప్పుడూ అడగడు. మిగిలిపోయిన పనంతా ఒంటిచేత్తో మీద చేసుకుపోతాడు. ఒక రిద్దరు గుమాస్తాలు 'ఇది న్యాయం కాద'ని తాము కూడా సాయం చేస్తే చిన్న నవ్వు నవ్వి ఊరుకుంటాడు. అంతకు మించిన భావ ప్రకటనలు అతని ముఖంలో కనిపించవు.

కనిపించటానికి పట్టుమని పది క్షణాలు ఎవరూ అతని ముఖం చూడరు. చూడవలసివస్తే ఏ గోడ మీది కేలండరుకేసో ముఖం పెట్టి, "ఫైలు అకౌంట్ సెక్షన్ కెళ్లింది, సార్! కేషియర్ సెలవు పెట్టాడట. వాడి చెల్లి పెళ్లట. తిరిగి చెక్కు ఎప్పుడు పాసవుతుందో తెలియదు" అని అప్పజెప్పి వెళ్లిపోతూంటారు.

ఆయన మేనేజర్ అనే గౌరవం కూడా తరచు పాటించరు. నూటికి తొంభై మందిలో భయం ఉంటే తప్ప 'గౌరవం' అనే భావం కలగదు. చంద్రశేఖరం అంటే భయం ఎవరికీ ఉండకపోవటం సహజమే. ఈ కాలంలో 'భక్తి' దేవుళ్లకే అంతంతమాత్రం. ఆఫీసు మేనేజరుకు లభిస్తుందా! అందునా కురూపికి!

అవును. అతని కళ్లు ఒకటి పైకీ, ఒకటి కిందికీ ఉంటాయి. పుట్టుకలో 'గ్రహణ దోషం' అని తల్లిదండ్రులు భావించారు. రెండు కళ్లలోనూ ఒకటి పెద్దదీ, ఒకటి చిన్నదిగా ఉంటుంది. వెరసి చూసేవారికి భయం కలుగుతుంది. భయం తగ్గితే జుగుప్స కలుగుతుంది.

చంద్రశేఖర్ మంచి మాటకారి అని ఎవరికీ తెలియదు.

చంద్రశేఖర్ చాలా హాస్యప్రియుడు అని ఎవరికీ పట్టదు.

అతను బాగా గ్రంథాలూ, కావ్యాలూ చదువుకున్నవాడు అని ఎవరూ ఎరుగరు.

అతనికి నాలు గెకరాల సుక్షేత్రమైన మాగాణీ ఉంది. ఒక అక్కా, తనూ, ఇద్దరే పిల్లలు. తండ్రి కాలం చేసి చాన్నాళ్లయింది. అక్కకు పెళ్లయి కూడా పదేళ్లయింది. తనకు పెళ్లి అవుతుందన్న నమ్మకం ఎవరికీ లేదు.

ఆ ఆఫీసులో మేనేజరు కుర్చీలో కూర్చున్నందున విధిలేక పలకరించటం తప్ప, ఎవరికీ అతని జీవిత వివరాలు తెలుసుకోవాలన్న ఆసక్తి కూడా లేదు - ఒక్క ప్రకాశరావుకి తప్ప.

ప్రకాశరావు అప్పుడే గుడ్డు పగలగొట్టి బయటకొచ్చిన కోడిపిల్ల లాంటివాడు. ప్రపంచం అతనికి పంచరంగుల వర్ణచిత్రంలా, పలు రకాల పుష్పగుచ్ఛంలా, ఆడ నెమలిలా, పయనించే జలప్రవాహంలా కనిపిస్తుంది. అలా కళ్లు తెరచి చూస్తూ, ఆశ్చర్యపోతూ 'ఓహో! దైవ సృష్టి ఎంతటి విచిత్రం!' అని నిముషానికి రెండుసార్లు కళ్లెగరేస్తూంటాడు. చంద్రశేఖరాన్ని చూసిన తొలి క్షణంలో కూడా అలాగే కళ్లెగరేశాడు. భయపడలేదు. అసహ్య పడలేదు. బాధపడనూ లేదు. ఆశ్చర్యపడ్డాడు. అందరికీ అంతో ఇంతో అందమైన ముఖాలిచ్చి ఏ దేవ కారణంచేతనో ఇతనికి ఈ శిక్ష విధించాలనిపించిన సృష్టికర్త నిర్ణయానికి ఆశ్చర్యపోయాడు.

చంద్రశేఖర్ సాయం వల్లనే తన కా గుమాస్తా ఉద్యోగం లభించిం దని తెలిసినప్పుడు -

అవును, సృష్టి రహస్యం ఇప్పు డర్థమైంది. ఆయన కా లోపమే లేకుండా ఉంటే నన్ను నాలుగు ప్రశ్నలు వేసి ఆట ఆడించును. లేదా, ఏ కానులకో దాసోహమని నన్ను అవతలికి పొమ్మనును. నేను నమస్కారం పెట్టి, "అయ్యా పేదవాణ్ని! మీరు కరుణించి నా కీ ఉద్యోగం ఇప్పించాలి!" అనగానే, చంద్రశేఖర్ నవ్వాలని ప్రయత్నించి నవ్వకుండా, "అలాగే, నా చేతనైన సాయం చేస్తాను!" అన్నాడు, చేశాడు. ఛైర్మన్ గారితో చెప్పి, ఇంకా క్వాలిఫైడ్ వాళ్లున్నా నాకే ఇప్పించాడు మహాత్ముడు.

# యావజ్జీవం

## చందు సుబ్బారావు

'ఈ బుద్ధి అతని కెలా కలిగిందీ! అతనిలోని అజన్మ బలహీనత ఈ దయాగుణం కలిగించింది. అందుచేత ఈ గుణానికీ, అతని రూపానికీ ప్రత్యక్ష సంబంధం ఉంది. సృష్టికర్త విధించిన రహస్యం ఇదే!" అని తన తేచిన లాజిక్‌తో అంతర్మథనం కావించుకుని, ఏమైతే నేం చంద్రశేఖరాన్ని అమితంగా అభిమానించసాగాడు.

అభిమానిస్తే వరవాలేదు, ఆనందంగా వలకరించేవాడు.

వలకరించి ఆగలేదు. గంటల తరబడి కబుర్లాడేవాడు. ఆఫీసులో అందర్నూ ముక్కు మీద వేలేసుకున్నారు.

"ఒరే, ప్రకాశం! ఆ చంద్రబింబంగాడితో ఎలా మాట్లాడుతున్నావురా! మొత్తానికి గొప్పోడివిరా! ఒక్క నిముషం మాట్లాడితే వాంతి అయ్యేటట్లు ఫీలవుతాం. నీవు మాత్రం ... అబ్బబ్బబ్బ!" అనేవాళ్లు తోటి గుమాస్తాలు.

"అలా అనకండిరా! దైవం అలాంటివాళ్లలోనే ఉంటా డంటారు. ఈశ్వరుడు ఏదో ప్రత్యేక కారణంచేత అలా శిక్ష విధిస్తాడు. మనం గ్రహించకపోతే మరుజన్మలో మన కే ఖర్మ ఎవరి కెరుక!" అంటాడు ప్రకాశం.

"మరుజన్మ సంగతి తర్వాత చూద్దాంలే! ఈ జన్మ కిలా వదిలేద్దూ! చంద్రం గారి ముందు నిముషం నిలబడలేం రా బాబూ! నువ్వేమైనా అను, అ దేం రూపంరా బాబో! ఖడ్గమృగం తల మనిషి కంటించినట్లుగా!"

"ఆయన చాలా మంచివాడురా!" అన్నాడు ప్రకాశం.

"ఆ మంచితనం నువ్వు కూడా పంచుకో తండ్రీ! మిమ్మల్నిద్దర్నీ భగవంతుడు కాపాడు గాక!" అని వెకిలి నవ్వు నవ్వేవాళ్లు.

"ఊరుకుందురూ! ఆయన చాలా మంచివారు. రూపం ముఖ్యమా, గుణం ముఖ్యం కాదా!" అని ఆఫీసులో ఆడ టైపిస్టు సరోజిని అంటూండేది.

"అహ్హా! అబ్బ సరోజినీదేవీ! నీకూ పెళ్లి కాలేదు కామోను! కట్టుకోగూడదూ! డబ్బులు కూడా బాగా దాచినట్టున్నాడు!" అని ఇహ్హిహ్హి అనేవాళ్లు మరికొందరు.

"తప్పకుండా చేసుకుంటాను. మీ మొహాల కేముందీ! అణా కానీ మనుమలు! ఆయనతో పోలికా!" అనుకునేది సరోజిని.

** ** **

చంద్ర శేఖర్ని ఛైర్మన్ బాగా గౌరవించేవాడు. మొత్తం సంస్థ లాభాలకు చంద్రశేఖరే కారణమని గ్రహించి, ఆఫీసు మేనేజర్ నుంచి చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా పదోన్నతి కల్పించాడు.

"గుడ్డేడికి ప్రమోష నొచ్చిందిరోయ్!" అన్నారు ఇతరులు.

"అతడు కారణ జన్ముడోయ్! రూపం చూసి మోసపోకండి దైవ స్వరూపాల్లో మనుమలు అలాగే ఉంటారు" అన్నాడు ప్రకాశం.

"ఇం కేం సరోజిని నిచ్చి పెళ్లి చెయ్!" అని ఎద్దేవా చేశారు.

"చేస్తాను! చేస్తాను!" అన్నాడు ప్రకాశం ఎవరూ వినకుండా. చంద్రశేఖర్‌కు ప్రమోషన్ వచ్చిందని కనీసం పార్టీ కూడా ఇవ్వలేదు ఎవ్వరూ. హృదయపూర్వకంగా అభినందనలు తెలిపాడు ప్రకాశరావు. షేక్‌హాండ్ ఇచ్చి, అభినందనలు తెలిపింది సరోజిని!

** ** **

అందరూ ఆఫీసు వదలి వెళ్లిపోయిన తర్వాత రోజువారీ కబుర్లలో ప్రకాశం ఆ విషయం ఎత్తాడు.

"అయ్యా! మీరు అన్యథా భావించనంటే ఒక్క విషయం ...."

"చెప్పు, ప్రకాశం! నీకంటే నాకు స్నేహితు లెవరున్నారు?"

"జీవితానికి సార్థకత ఆ ఒక్క విషయం కూడా పూర్తయితేనే ..."

"... ..."

"అదే ... కల్యాణం. తమ దృష్టి నుంచి కూడా ఆలోచించకపోలేదు. ఈ వేళంటే కాలూ, కన్నూ ఉంది కనుక సరిపోతుంది. తీరా వార్ధక్యంలో ఒక ప్రాణి అంటూ మనతో ఉండాలి కూడా!"

"అందుకని ఆ ప్రాణిని హింసించాలా!" అన్నాడు చంద్రం.

ప్రకాశానికి ఏమి చెప్పాలో, ఏమి చెప్పకూడదో అర్థం కాలేదు. కాసేపు ఆలోచించి, తేరుకుని మాట్లాడేంతలో -

"న న్నెవరు చేసుకుంటారు ప్రకాశం? నా అక్క కూతురు నా చేతుల్లో పెరిగింది ... అదే చేసుకోనని చెప్పింది. తీరా మా అక్క మొండికేస్తే నూతిలో దూకబోయింది. నేను ఉభయుల్నీ సముదాయించి, దాని కిష్టమైన సంబంధం చెయ్యమని చెప్పాను. అయినవాళ్లకిలా ఉంటే, పరాయి పిల్లల సంగతి ..." చంద్రం గొంతులో జీర.

"ఆ సంగతి నా కొదిలేయండి. కామాక్షి అని హిందీ ప్రవీణ వరకు చదివిన పిల్ల. తండ్రి లేడు. తల్లి నాలుగిళ్లలో వంట చేసుకుని వెళ్లబోస్తోంది. పిల్ల తమలపాకులా ఉంటుంది. పెద్ద కాంక్ష లేమీ లేవు. జీవనోపాధి ప్రసాదించగలిగితే చాలని అంటున్నారు తల్లీ, బిడ్డానూ!"

"ఎందుకయ్యా వాళ్ల కీ యావజ్జీవ శిక్ష!"

"శిక్షే, రక్షే! వాళ్లు కదా కోరుతున్నారు!"

"... ..." చంద్రం.

"... ..." ప్రకాశం.

** ** **

చంద్రశేఖరం రిజిస్టర్ మేరేజ్‌కి ప్రకాశం, సరోజినీ సాక్షులు. మ రెవ్వరూ లేరు. ఛైర్మన్ గారు పుష్పగుచ్ఛం పంపారు. తోటి గుమాస్తాలు లోకల్ టెలిగ్రాం కొట్టారు - 'చాల్లెద్దూ సంబడం!' అనుకుంటూ.

"ఏమో అనుకున్నాంరా! ప్రకాశంగాడు అన్నంతవనీ సాధించాడు!"

"ఏం, సాధింపులే! పర్సంటేజి కొట్టుంటాడు. అలా కనిపిస్తాడు కానీ, వెర్రిపీనుగ కాదురోయ్! చంద్రశేఖరం దగ్గర చాలా డబ్బుంది. వీడి కన్ను దాని మీద పడ్డట్లుంది. ఏమంటావు సరోజినీ!"

"మీరు నోరు ముయ్యండంటాను!" కోపంగా అంది సరోజిని.

** ** **

తొలి రాత్రి కెవ్వున కేక పెట్టి స్పృహతప్పి పడిపోయిందట కామాక్షి. చంద్రశేఖరానికి భయం వేసింది. ఫోన్ చేసి ప్రకాశాన్ని పిలిపించాడు.

"డాక్టరు వద్దకు తీసుకెళ్దామా?" అన్నాడు.

ప్రకాశం కాస్త తెలివిగానే ఆలోచించాడు. డాక్టరు వద్దకు వద్దని, ముఖం మీద నీళ్లు చల్లి, లేపి కూర్చోపెట్టాడు. కాస్త వేడి పాలిచ్చి, కోలుకున్నాక ధైర్యం చెప్పాడు.

ధైర్యం ఎలా చెప్పాడో, ఏం చెప్పాడో బయట కూర్చున్న చంద్రశేఖరానికి తెలియలేదు. 'ఈ చండాలానికి మరో ప్రాణిని ఎందుకు బలితీసుకున్నాను?' అని ఖిన్నుడైపోయి కుర్చీలో కూర్చుండిపోయాడు. ప్రకాశాన్ని చూడగానే ఎన్నడూ లేనిది గట్టిగా ఏడ్చేశాడు.

"అయ్యా! తమరు కన్నీరు పెట్టకూడదు. నా మీదొట్టు! ఇలాంటివి జీవితంలో లక్ష జరుగుతాయి. ఏడవవలసిన సమయం కా[illegible] మరోసారి ఇలా జరగదు. మీరు ఆత్మన్యూనతా భావం వీడాలి. సృష్టిలో అంతా వల్లకి ఎక్కేవాళ్లే అయితే, మోసే వాళ్లెవరు? నా మాట వినండి. లోపలకు వెళ్లండి!" అన్నాడు ప్రకాశం.

చంద్రశేఖరం మాట విన్నాడు కానీ, లోపలకు వెళ్లలేదు. మరి రెండు రోజులపాటు కామాక్షి ఎదుట కూడా పడలేదు.

** ** **

ఆఫీసులో ఆ సంగతి గుప్పుమంది. ఎలా వచ్చిందో ప్రకాశానికి చాలా ప్రయత్నం మీద గానీ తెలియలేదు. 'కామాక్షి రాత్రుళ్లు నిద్ర మాత్రలు వాడుతుంద'న్న విషయం ప్రకాశం కూడా ఎవరికీ చెప్పలేదు. ఎట్టొచ్చీ కామాక్షి తల్లి వాచాలత్వం వల్ల ఆ ఇల్లూ ఆ ఇల్లూ తిరిగి ఓ ఇంట్లో ఈ ఆఫీసు గుమాస్తా ఉండటంచేత వలయం పూర్తయింది.

అంతా నోళ్లు నొక్కుకున్నారు. ఛీ అన్నారు. ఛా అన్నారు. అంతకంటే ఏం చేస్తుం దన్నారు. 'రాక్షసుడితో నిద్ర మాటలా' అని విశ్లేషించుకున్నారు. మనుషులుగా ఆలోచించలేదు. మానవత్వం గురించీ పట్టించుకోలేదు.

"దొంగముండాకొడుకు! దాని బతుకు తీసి ఇల్లు కట్టించుకున్నాడు!" ఒకరు.


"ఇల్లా" వేరొకరు!

"ఆఁ, వీడి బోడిముండా ఆదాయంతోనే అంతిల్లూ కట్టించా డేమిటి? గుడ్డోడికి పిల్ల నిచ్చినందుకు రెండు లక్షలు కమీషన్ కొట్టాడు!" ఒకరు.

"కూడు లేనిదాన్ని కారుల్లో తిప్పుతున్నందుకు ఆ పిల్ల తల్లి వీడింట్లో కుక్క చాకిరీ చేస్తోంది!" వేరొకరు.

"ప్రకాశంగాడు ఎంత అఘాయిత్యపు ... కొడుకో గ్రహించారా!" అందరూ.

ఆఫీసులో విషయాలు వినవలసిన వాళ్లంతా విన్న తర్వాత చంద్రశేఖరానికి, ప్రకాశానికి, సరోజినికి కాస్త ఆలస్యంగా తెలిశాయి. చంద్రశేఖరం కళ్లు దించుకున్నాడు.




సరోజినికి వీళ్ల తత్వం మీద కోపం వచ్చింది - ఎదుట వాళ్ల కష్టాల్లో పాలు పంచుకోలేని వాళ్లకు సుఖాల గురించి ఆరా ఎందుకూ అని.

ప్రకాశరావుకి నవ్వొచ్చింది. ఆనాడు 'పెళ్లి కాదూ' అంటిరి. అయితే 'అయిందా' అని ఆశ్చర్యపోయిరి. ఈ వేళ వాళ్లు సుఖంగా ఉంటున్నారూ అంటే 'అదెలాగూ' అని గుండెలు బాదుకుంటున్నారు. సృష్టిని చూసి ఆ రహస్యం ఎరుగని వారికి అన్నీ ఇలాంటి సంశయాలే తగలడతాయి అనుకున్నాడు. తెలియనివాళ్లు తెలిసినట్లుగా మాట్లాడటం చూస్తే నవ్వొచ్చిం దతనికి!

** ** **

పది సంవత్సరాలు గడిచాయి. కాలం కరుణించింది. ఓ బిడ్డను కని కామాక్షి కన్ను మూసింది. చంద్రశేఖరం ఏడవలేదు. యావజ్జీవ శిక్ష తప్పించుకున్నందుకు మనసారా అభినందించాడు కామాక్షిని.

సంస్థ యాజమాన్యం చంద్రశేఖరాన్ని మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించింది. ప్రకాశరావుని మేనేజరుగా వేసుకున్నాడు చంద్రం. సరోజినిని సెక్రటరీగా నియమించాడు. ఇంటికొచ్చి అప్పుడప్పుడూ పిల్లవాడి బాగోగులు చూసి వెళ్తూంటుంది.

ఈవేళ చంద్రశేఖరానికి చాలా ఆనందంగా ఉంది. పిల్లవాడి ఆపరేషన్ సక్సెస్ అయింది. వాడికి యావజ్జీవ శిక్ష తప్పింది. తన చిన్నతనంలో ఈ వైద్య సౌకర్యం లేదనే తన కీ శిక్ష పడింది. పిల్లవాడి ముఖంలో తన రూపు రేఖలు చూడగానే కామాక్షి గుండె పగిలి చచ్చిపోయింది. బతికుంటే ఎంత సంతోషించునో!

అమెరికాలో జరిగిన మొత్తం ఆపరేషన్ ఖర్చు భరించగలిగిన తన ఉద్యోగానికీ, తన ముఖాన్ని చూసి భరిస్తూ తనకు అండగా నిలిచిన ప్రకాశానికీ, సరోజినికీ రెండు చేతులూ ఎత్తి నమస్కరించినప్పుడు ...

"మీరు పెద్దవారు. అలా అనకూడదు!" అన్నారు వా ళ్లిద్దరూ.

